సాక్షి ప్రకాశం

శనివారం । 16 । మార్చి । 2024



ముస్లింలకు అండగా ఉంటా

ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులో ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు.

- 8లో..



ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. శుక్రవారం 17096 మందికి గాను 16,258 మంది హాజరయ్యారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36/26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

శనివారం - ఇఫ్తార్ : సా॥ 6.25

ఆదివారం - సహరీ : ఉ॥ 4.57



న్యూస్‌రీల్

ఎన్నికల ఖర్చుపై అవగాహనతో ఉండాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై పూర్తి అవగాహనతో ఉండి ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని ఆ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికలు, ఓటరు జాబితా క్లెయిమ్‌లపై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫారమ్ 6,7,8 క్లెయిమ్‌లు సుమారు 4 వేలు పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితాలో తొలగింపులు సాధ్యపడవని కేవలం చేర్పులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై, నామినేషన్ పత్రాలు సమర్పించడంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ పాల్గొన్నారు.



పుల్లలచెరువు మండలం నాయుడుపాలెంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్న దృశ్యం

ప్రజల

కష్టాలు తీరేలా..

వేసవిలో తాగునీటి ఎద్దడిపై జిల్లా యంత్రాంగం ఫోకస్ పెట్టింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలో 58 ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

- పశ్చిమ ప్రకాశంలో నీటి సమస్య పరిష్కారంపై దృష్టి
- యర్రగొండపాలెం, దర్శి, పొదిలి మండలాల్లో ప్రత్యేక చర్యలు
- 58 తాగునీటి ఎద్దడి కలిగే ప్రాంతాల గుర్తింపు
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ఒంగోలు సిటీ:

వేసవి అనగానే మనకు ప్రాంతాల్లో బారులు తీరిన లైన్లలో బిందెలు, ఆ ప్రాంతాల్లో గొడవలు మనకు కనబడుతుంటాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటికీ చెక్ పెట్టింది. వర్షభావం కారణంగా పశ్చిమ ప్రకాశంలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రదేశాల్లో తాగునీటి సరఫరా కోసం ముందే అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడైతే నీటి వనరులు, భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయో గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు సిద్ధమయ్యారు. పొదిలి, యర్రగొండపాలెం, దర్శి మండలాల్లో 58 తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా...

సరైన వర్షాలు కురవక కాకపోవడంతో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దర్శి నియోజకవర్గం దొనకొండలో 10 ప్రాంతాల్లో, మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో 2 ప్రాంతాలు, యర్రగొండపాలెం మండలంలో 10, పెద్దారవీడు మండలంలో 16, పుల్లలచెరువు మండలంలో 16, త్రిపురాంతకం మండలంలో 4 ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించారు. మొత్తం 58 తాగునీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాలకు 4 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 15 లీటర్ల నీటిని అధికారులు అందిస్తున్నారు. రోజుకు 200 ట్రిప్పుల ట్యాంకర్లను 58 ప్రాంతాల్లో నీటి సరఫరా చేస్తున్నారు.

> **తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు**
>
> 
>
> ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించేందుకు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాం. వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.
>
> – షేక్ మారధాన్ అలీ, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఒంగోలు.

వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం ఇదే

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం జిల్లా కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు: సూరసాని మోహన్‌రెడ్డి (కనిగిరి), ఉపాధ్యక్షుడు-కాట్రగడ్డ సురేష్ (ఒంగోలు), యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (వై.పాలెం), ప్రధాన కార్యదర్శులుగా కరణం రమేష్ (సంతనూతలపాడు), మేరువ పిచ్చిరెడ్డి (దర్శి), తాతా నాంచారులు (ఒంగోలు), ఏరువ నరశింహ చౌదరి (కనిగిరి), ఉప్పలపాటి శ్రీనివాసరాజు (కొండపి), గుజ్జుల రమణారెడ్డి (మార్కాపురం), కార్యదర్శులుగా బడే అంకిరెడ్డి, బొక్కిసం శివరామయ్య (సంతనూతలపాడు), గద్దల ప్రసాద్, నాగం బ్రహ్మయ్య (ఒంగోలు), కె.సుబ్బారావు, కొత్తపల్లి బ్రహ్మరెడ్డి (మార్కాపురం), అత్తులూరి తిరుపతినాయుడు, ఎనిమిరెడ్డి కృష్ణారెడ్డి (కొండపి), బాదం రమణారెడ్డి, ఎం.కృష్ణారెడ్డి (దర్శి), మూల సత్యంరెడ్డి, కె.కాశిరెడ్డి (వై.పాలెం), అంబాల చిన వెంకటరెడ్డి, అచ్చల శ్రీనివాసులురెడ్డి (కనిగిరి), ఎం.పద్మాకరరావు, పత్తిపాటి నాగేశ్వరరావు (ఒంగోలు), దాసరి రమేష్, పాలపర్తి మధుసూదనరావు (సంతనూతలపాడు), వెన్నా వెంకిరెడ్డి, టి.శ్రీకాంత్‌రెడ్డి(వై.పాలెం), బత్తిన మాల్యాద్రి, శ్యామల వెంకట కృష్ణారెడ్డి, ముండ్లమూరు సురేష్‌బాబు (కొండపి), కందుల శివరామిరెడ్డి, పాముల వెంకట సుబ్బయ్య (కనిగిరి), గొట్టిపాటి బాలకోటయ్య, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (దర్శి), (ఒంగోలు), ప్రధాన కార్యదర్శిగా వి.రాఘవరాజు (ఒంగోలు), పాలెం బాలాంజనేయరెడ్డి (సంతనూతలపాడు), నల్లూరి సురేంద్రబాబు, కూనం నరేంద్రరెడ్డి, షేక్ అల్లాభక్షు (కొండపి), గంగిరెడ్డి యలమందారెడ్డి (దర్శి), బట్టగిరి తిరుపతిరెడ్డి (మార్కాపురం), కాసు వెంకటరెడ్డి (వై.పాలెం), లక్కపోగు ప్రకాశం (కనిగిరి), కార్యదర్శులుగా గుంటక రమణారెడ్డి, ఎం.అనంతారెడ్డి (కనిగిరి), కుమ్మరగుంట అనీల్, దిండు నరశింహ (కొండపి), సామంతుల వీరారెడ్డి. పాలపర్తి సుబ్బారావు, సంకెరవణయ్య (ఒంగోలు), మేడికొండ శేషగిరిరావు, గోపనబోయిన ఫిలిప్‌రాజు (దర్శి), గుంటక వెంకటరెడ్డి, గాయం కనక నాగేంద్రరెడ్డి (మార్కాపురం), అలువల లక్ష్మయ్య (వై.పాలెం), గంజి శ్రీనివాసరెడ్డి (వై.పాలెం), తేళ్ల పుల్లారావు, కత్తి చెన్నకేశవులు (సంతనూతలపాడు), సంయుక్త కార్యదర్శులుగా వంకాయలపాటి రాజేష్, చీదెర్ల వెంకటేశ్వర్లు అలియాస్ శేషు, షేక్ బ్రహ్మయ్య (సంతనూతలపాడు), తన్నీరు వినోద్‌కుమార్, పావులూరి రాఘవ, బొబ్బల భానుప్రసాద్, మాకినేని హరీష్(కొండపి), కొర్రపాటి శ్రీనివాసరావు, వడ్డె మాలకొండయ్య (దర్శి), మందలపు శ్రీనివాసరెడ్డి, జూపల్లి ప్రతాప్, షేక్ గౌస్ మొహిద్దీన్(మార్కాపురం), చాపల ఆంజనేయులు, మన్నె శ్రీనివాసరావు, షేక్ బదురుద్దీన్, గోనెల శివకుమార్, నక్కల శ్రీకాంత్ (ఒంగోలు), అబ్దుల్లా లతీఫ్ (కనిగిరి), ఆకుల వెంకటేశ్వర్లు, దూళ్ల బాపూజీ (వై.పాలెం).

వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షునిగా గుజ్జుల సంజీవరెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షునిగా గుజ్జుల సంజీవరెడ్డి (మార్కాపురం)ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉపాధ్యక్షునిగా కంకణాల వెంకట్రావు

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షునిగా ఎస్.వెంకటేశ్వర్లు

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షునిగా ఎస్.వెంకటేశ్వర్లును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్.వెంకటేశ్వర్లు మార్కాపురం నియోజకవర్గానికి చెందిన నాయకులు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

ఒంగోలు అర్బన్: ప్రజలు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం స్పందన భవనంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దీనికి జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య ప్రకటనలకు ఆకర్షితులై వస్తువులు కొనుగోలు చేయడం మంచిది కాదన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ షాపింగ్ వచ్చిన తర్వాత ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని, వీటిపట్ల ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని, అందుకు యంత్రాంగం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన సేవలు పొందే హక్కు వినియోగదారులకు ఉంటుందని చెప్పారు. దేశం ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులే కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు సమీరా, మెప్మా పీడీ రవికుమార్, నాగేశ్వరరావు, నరసింహులు, వీరారెడ్డి, అంజయ్య, తిరుమల రాధాకృష్ణ, నాగేంద్ర, లక్ష్మీపార్వతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినియోగదారుల కోసం ఉద్యమాలు చేసిన పలువురిని సత్కరించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోలు

ఒంగోలు సెంట్రల్: మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నలను (హైబ్రీడ్) కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కనీస మద్దతు ధర రూ.3180గా నిర్ణయించినట్లు చెప్పారు. మహేంద్ర, నంద్యాల తెల్లజొన్న పంట వేసి, ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు సీఎంయాప్‌లో శనివారం నుంచి ఆర్‌బీకేలలో వీఏఏల ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు నుంచి గరిష్టంగా ఐదు ఎకరాల్లో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. పేర్లు నమోదు చేసుకునే సమయంలో నూర్పిడి తేదీ నమోదు చేయాలని, దీంతో సరుకును అమ్ముకునే తేదీ రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్‌కు సమాచార రూపంలో వస్తుందని తెలిపారు. సరుకు అమ్మే సమయంలో రైతులు తమ ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు పుస్తకం, ఫోన్ నంబర్‌తో సహా పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. జొన్నలను శుభ్రం చేసి ఆరబెట్టి 14 శాతం లోపు ఉండాలి.

ఒక్క గుడిసె కూడా కనిపించకూడదు

- 9 నెలల్లో పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇస్తాం
- ప్రజల కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడైనా తెరిచే ఉంటాయి
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని అర్హులైన నిరుపేదలందరికీ 9 నెలల్లో పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని 24వ డివిజన్ లోని సమైఖ్యతా నగర్‌లో శుక్రవారం సంచార జాతుల బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నగరంలోని 25 వేలమందికి ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చామని, ఇంకా ఎవరికైనా ఇళ్ల స్థలాలు మంజూరు కాకపోతే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నగరంలో ఒక్క గుడిసె కూడా కనిపించకూడదన్నది తన లక్ష్యమన్నారు. తొమ్మిది నెలల్లో ఇళ్లు నిర్మించి గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి గాను కార్పొరేషన్ జనరల్ ఫండ్ ద్వారా రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గత పాలకులు రోడ్డు మీద రోడ్డు వేసి రంగులు వేశారని, శివారు ప్రాంతాలను పట్టించుకోలేదని చెప్పారు. కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీలు తీసుకొని అభివృద్ధి చేసినట్లు తమ అనుకూల మీడియాలో ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. గతంలో పింఛన్ డబ్బుల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, సంతకాలకు కూడా లంచం ఇవ్వాల్సి వచ్చేదన్నారు. జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పాలన కొనసాగుతుందని చెప్పారు. మీకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలబడతాను, మీ కోసం నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. రెండు నెలల్లో కమ్యూనిటీ భవనం నిర్మాణం పూర్తవుతుందని, తానే దగ్గరుండి ఇక్కడ మొదటి పెళ్లి జరిపిస్తానన్నారు. మీ అందరి ఆశీస్సులతో మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ మాట్లాడుతూ సమైఖ్యతానగర్‌లో కమ్యూనిటీ భవనం నిర్మాణం ఇక్కడి ప్రజల చిరకాలవాంఛ అన్నారు. అడిగిన వెంటనే కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయించిన వాసన్నకు రుణపడి ఉంటామని అన్నారు. ఇప్పటికీ 24వ డివిజన్‌లో రూ.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. బాలినేని హయాంలోనే సిమెంటు రోడ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, మంచినీటి పైపు లైను వేశారని, ఇప్పుడు కమ్యూనిటీ హాలు నిర్మించారన్నారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శిలాఫలకాలు వేయడమే తప్ప ఒక్క అభివృద్ధి పని చేసింది లేదని వైఎస్సార్ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ విమర్శించారు. తొలుత టీడీపీకి చెందిన పెద్దకత్తుల శ్రీను కుటుంబ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, డివిజన్ అధ్యక్షుడు తోట సత్యనారాయణ, సీనియర్ నాయకులు బేతంశెట్టి హరిబాబు, సీనియర్ బీసీ నాయకులు పొగర్తి చెంచయ్య, పొగర్త శ్రీను, పొగర్త సత్యనారాయణ, గరికపాటి కనకదుర్గ, తూము పద్మ, షేక్ మీరావలి, షేక్ అబ్దుల్ ఖుద్దెస్, ఆర్. వాసుబాబు, జాలపాటి వెంకట నరసయ్య, పర్చూరి శివ కుమార్, బత్తుల శ్రీను, చింతల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

- జగనన్న చేయూత చెక్కుల పంపిణీ
- సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి మండలాలు
- ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ సురేష్



మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): ఒక్క అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మహిళలకు విజ్ఞప్తి చేశారు. సింగరాయకొండ మండల కేంద్రంలో దేవి సీ ఫుడ్స్ కంపెనీ సమీపంలో శుక్రవారం సింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు మండలాల వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ చేయూత పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా లబ్ధిదారులు 26 లక్షల మందికి 20 వేల కోట్ల రూపాయల నగదు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ పథకం కింద 4వ విడతగా 15,230 మందికి ఒక్కొక్కరికి 18,750 చొప్పున రూ.28.55 కోట్లు అందజేస్తారన్నారు. సింగరాయకొండ మండలంలో 3,992 మందికి రూ.7.48 కోట్లు, టంగుటూరు మండలంలో 3646 మందికి రూ.6.83 కోట్లు, జరుగుమల్లి మండలంలో 2,145 మందికి రూ.4.02 కోట్లు అందిస్తారన్నారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, వసతిదీవెన, జగనన్న తోడు, రైతు భరోసా వంటి పథకాలతో పాటు అనేక పథకాలు ఇచ్చిన మాట ప్రకారం కరోనా వంటి కష్టకాలంలో కూడా సాకులు చెప్పకుండా అందజేశాడని కొనియాడారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని గత పాలకు సరిగా పట్టించుకోకపోవటంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. తాను మూడు నెలల కాలంలో రూ.1.25 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశానని వివరించారు. నియోజకవర్గంలో సంగమేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, రామతీర్థం నుంచి అవసరమైన వరకు మంచినీరు తీసుకొచ్చి తాగునీటి, సాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉందని, పాలేరు, మూసీ, మన్నేరు పై చెక్ డ్యాంలు, రైల్వే ఫ్లైఓవర్లు, రోడ్లు వెడల్పు చేయాల్సి ఉందని, దేవదాయ భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. విద్యా సంస్థలను నెలకొల్పాలని ఆయన వివరించారు. తనకు ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తానని, తాను సింగరాయకొండలో స్థిర నివాసం ఏర్పరచుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానని వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందని భావిస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఫ్యాను గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చేయూత చెక్కులను మండలాల వారీగా పంపిణీ చేసి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తరువాత పీఎంఈజీపీ లబ్ధిదారులకు యూనిట్లను అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ కట్టా శోభారాణి, ఎంపీటీసీలు ఏపూరి శ్రీనివాసులు, కె అంకయ్య, షేక్ షకీల, అంబటి ప్రసాద్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పుట్టా వెంకట్రావు, సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాపూరి ప్రభావతి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, చుక్కా కిరణ్‌కుమార్, పిట్టా బ్రహ్మయ్య, ఆదిపోగు మాలకొండయ్య, మిరియం సుధాకర్, తహశీల్దార్ భవానీశంకర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, కొండపి ఏసీ సనిత, ఏపీఎం డీ జయరాజ్, పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

పైసా అవినీతి లేకుండా జగన్ పారదర్శక పాలన

- దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా మహిళలకు పెద్దపీట
- మంత్రి మేరుగు నాగార్జున
- రూ.4.44 కోట్ల చేయూత చెక్కులు, 2500 మందికి ఇంటి పట్టాల పంపిణీ



వైఎస్సార్ క్రీడావికాసం స్టేడియంను ప్రారంభించిన మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు గడిచిన ఐదేళ్లలో పైసా అవినీతి లేకుండా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను పారదర్శకంగా పేద ప్రజలకు అందించారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు, పేర్నమిట్టలో శుక్రవారం మంత్రి మేరుగు నాగార్జున సుడిగాలి పర్యటనలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోని మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. చంద్రబాబునాయుడు 2014లో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి చివరకు మేనిఫెస్టోను కూడా ప్రజలకు కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి గుట్టు చప్పుడు కాకుండా తీసేసి చేతుల దులుపుకున్నాడని ఎద్దేవా చేశారు.

రూ.4.44 కోట్ల చేయూత నిధుల చెక్కులు పంపిణీ:

సంతనూతలపాడులోని 2,370 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.4.44 కోట్ల విలువ కలిగిన చెక్కును ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు విడతలలో సంతనూతలపాడులో 2,370 మందికి కలిపి రూ.15.78 కోట్ల విలువైన చేయూత చెక్కులను అందించినట్లు తెలిపారు. దానితో పాటు సంతనూతలపాడు జెడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో దాదాపు రూ.1.50 కోట్లతో నిర్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి క్రీడావికాసం స్టేడియంను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. మరో రూ.2.50 కోట్లతో నిర్మించిన సిండికేట్ రైతు సొసైటీ భవనం, ఎన్ఆర్ఈజీఎస్ భవనం, వైఎస్సార్ క్రాంతి పథం భవనం, వ్యవసాయ కార్యాలయం భవనం, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌కు చెందిన రెండు గదులు, ప్రహరీ, ఆర్చి నిర్మాణాలను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. పేర్నమిట్ట 39వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2500 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ దుంపా చెంచిరెడ్డి, మారెళ్ల బంగారుబాబు, బీ.విజయ, దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, దర్శి నాగమణి, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ తిరుపతిరావు, నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి వైద్య ఆరోగ్య సిబ్బంది క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

పెద్దదోర్నాల: గత 21 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ఆరోగ్య సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లు వెంకటేశ్వరరెడ్డి, భరత్‌భూషణ్, సత్యానందం, రాజెమ్మ ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతల వైద్యాధికారిణి సాయి ప్రశాంతి మాట్లాడుతూ 21 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ సిబ్బందిగా బాధ్యతలు నిర్వహించిన ఎంతో మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. దీనివలన అందరికీ ఉద్యోగ భద్రత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మంత్రు నాయక్, సూర్యకుమారి, ఇజ్రాయేల్, యం.యల్.హెచ్.పీలు నిర్మల, ఎస్తేరురాణి, పుష్పలత, సౌజన్య, పద్మావతి, అజిమాభాను, నాగలక్ష్మి, రాణి ఆరోగ్యమిత్రలు చంద్రశేఖర్, మణికుమార్, జనార్దన్, మోహనకృష్ణ, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నేడు అమరజీవి జయంతి

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరవుతారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వివిధ పదవుల్లో ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

ఉరేసుకుని వివాహిత మృతి



లక్ష్మీప్రసన్న మృతదేహం

పుల్లలచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పుల్లలచెరువు మండలంలోని చాపలమడుగు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. పామూరుకు చెందిన లక్ష్మీప్రసన్న(28)కు, చాపలమడుగుకు చెందిన మిరియాల వెంకటరమణతో ఆరు నెలల క్రితమే వివాహమైంది. అన్యోన్యంగా సాగాల్సిన వీరి దాంపత్యంలో మనస్పర్థలు పొడచూపాయి. క్షణికావేశానికి లోనైన లక్ష్మీప్రసన్న ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణాలు విడిచింది. సంఘటనా స్థలాన్ని సీఐ రాములునాయక్, ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా పరిశీలించి, ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్

- మహిళా కండక్టర్‌పై దాడి
- చితకబాదిన ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు



యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో ఓ యువకుడు శుక్రవారం మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. అందిన సమాచారం మేరకు.. మద్యం మత్తులో ఉన్న యువకుడు కనిగిరి నుంచి ఆర్టీసీ బస్సులో పొదిలి డిపోకు చేరాడు. పొదిలి వచ్చింది బస్సు దిగాలని చెప్పిన మహిళా కండక్టర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. 'నేను దిగనంటే దిగను, ఏం చేస్తావో చేసుకో' అంటూ బస్సులో మొబైల్ ఫోన్ చూస్తూ అలాగే కూర్చున్నాడు. మహిళా కండక్టర్ పరిస్థితిని గమనించిన తోటి ఉద్యోగులు, బస్టాండ్‌లోని కొందరు ప్రయాణికులు ఆ యువకుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులకు మహిళా కండక్టర్ ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు టౌన్: అనారోగ్య పరిస్థితులతో ఏదైనా శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారికి ఆరోగ్య ఆసరా కింద రోజుకు రూ.225 చొప్పున గరిష్టంగా నెలకు రూ.5 వేల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న భృతిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని 2019లో ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొంది డిశ్చార్జి అయిన తర్వాత విశ్రాంతి సమయంలో జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఈ భృతిని అందించడం జరుగుతుందన్నారు. డిశ్చార్జి నాటికి వారి ఖాతాల్లో ఆసరా మొత్తం జమచేయబడుతుందన్నారు. సాధారణ, సీజేరియన్ కాన్పులకు కూడా రూ.5 వేల ఆసరా చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వంచే గుర్తించబడిన ఆస్పత్రుల్లో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలు గురించిన సమాచారాన్ని ఆస్పత్రుల్లో ఉండే ఆరోగ్య మిత్రల ద్వారాగానీ, 104కు ఫోన్ చేయడం ద్వారాగానీ తెలుసుకోవచ్చని తెలిపారు.

లారీని ఢీకొట్టిన ఆటో

టంగుటూరు: పికప్ డౌన్ అయిన లారీని వెనుక నుంచి ట్రక్ ఆటో ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురువారం అర్ధరాత్రి టంగుటూరు మండలం వల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు నుంచి ఒంగోలు వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న లారీ ఒక్కసారిగా పికప్ డౌన్ అయింది. లారీని రోడ్డు మార్జిన్‌లో నిలుపుతున్న క్రమంలో వెనుక నుంచి బ్లూ డార్ట్ కొరియర్ సంస్థకు చెందిన ట్రక్ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఒంగోలు మదర్‌థెరిసా కాలనీకి చెందిన డ్రైవర్ షేక్ కమ్రుద్దీన్(22) అక్కడికక్కడే మృతి చెందగా, ఒంగోలు వెంకటేశ్వర కాలనీకి చెందిన మాదాల బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నాగేశ్వరరావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలకు అండగా ఉంటా

- పవిత్ర రంజాన్ మాసంలో శుభాలు కలగాలని ఆకాంక్షిస్తున్నా..
- ఇఫ్తార్ విందులో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఐటీపీ ఫంక్షన్ హాలులో హైకోర్టు అడ్వకేట్ షేక్ రషీద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ముస్లింలతో తనకు అనిర్వచనీయమైన బంధం ఉందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో మీరు ఉపవాసం ఉంటూ సర్వమానవాళి సంతోషంగా ఉండాలని చేసే ప్రార్థనలు ఫలించాలని కోరుకుంటున్నానన్నారు. మతం అనేది ఏదైనా మంచినే కోరుతుందన్నారు. ప్రత్యేక ఉపన్యాసకులుగా విచ్చేసిన పీఎంఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ చేసిన ప్రసంగమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. అన్ని మత గ్రంథాలలోని సారాంశాన్ని ఔపాసన పట్టి ఆయన అందించిన సందేశం అద్భుతమన్నారు. ముస్లిం కుటుంబాలకు న్యాయం జరగాలని, వారు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారన్నారు. దానివల్ల ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరుకోవడం సాధ్యపడిందన్నారు. వైఎస్సార్ ఆశయాలే లక్ష్యంగా ఏర్పాటైన వైఎస్సార్ సీపీ కూడా ముస్లింలకు అండగా ఉంటూనే ఉందన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంటరిగా బరిలోకి దిగుతుంటే ప్రతిపక్షాలు మాత్రం జెండాలన్నీ జతకడుతున్నాయన్నారు. 2014లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీచేశాయని, 2019 వచ్చేసరికి బీజేపీతో భవిష్యత్తులో కలవనంటూ చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ పాకులాడి మరీ బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నారు. అనైతిక పొత్తులు ఒకవైపు, మంచి చేశాం కనుకే ఓటేయమనే మా విజ్ఞప్తి మరో వైపు మీ ముందు ఉన్నాయని, తప్పకుండా 6వ సారి అసెంబ్లీ బరిలోకి దిగుతున్న తనకు ఓటేసి గెలిపించాలని బాలినేని కోరారు. రంజాన్ మాసం పవిత్రత గురించి సిరాజ్ ఉర్ రెహమాన్ వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు షేక్ రషీద్, నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, ఖలీల్, మీరావలి, షంషీర్, బాషా, మునీర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముస్లింలు నమాజు నిర్వహించి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

హక్కులపై అవగాహన.. మోసాలపై అప్రమత్తత

- వాణిజ్య ప్రకటనలు, ఆన్‌లైన్ ఆఫర్లన్నీ నమ్మి మోసపోవద్దు
- ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో జేసీ గోపాలకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వాణిజ్య ప్రకటనలకు ఆకర్షితులై వస్తువులు కొనుగోలు చేయడం మంచిది కాదన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ వచ్చిన తర్వాత ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని, వీటిపై ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుకు యంత్రాంగం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన సేవలు పొందే హక్కు వినియోగదారులకు ఉంటుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులే కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. 1973 నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్చి 15వ తేదీ వినియోగదారుల హక్కుల దినం పాటించడం ప్రారంభమైందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రధాన లక్ష్యం లోపభూయిష్టమైన వస్తువులు, అసంతృప్తికరమైన సేవలు, మోసపూరితమైన వాణిజ్య పద్ధతులు వంటి వివిధ రకాల దోపిడీకి వ్యతిరేకంగా వినియోగదారులకు సమర్థవంతమైన భద్రతలు అందించడమేనని అన్నారు. అనంతరం వినియోగదారుల కోసం ఉద్యమాలు చేసిన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు సమీరా, మెప్మా పీడీ రవికుమార్, నాగేశ్వరరావు, నరసింహులు, వీరారెడ్డి, అంజయ్య, తిరుమల రాధాకృష్ణ, నాగేంద్ర, లక్ష్మీపార్వతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో రాబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో వినియోగదారుల ఫోరమ్ సభ్యులకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటింగ్ ప్రాముఖ్యత, ఎథికల్ ఓటింగ్, ఈసీఐ మొబైల్ అప్లికేషన్ల డౌన్‌లోడింగ్, జిల్లా ఎన్నికల అధికారి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు బి.రవి, వీఎస్ జ్యోతి, డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన నగదుతో ఫీజులు చెల్లించాలి

ఒంగోలు సెంట్రల్: 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు 2022 డిసెంబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసిందని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికార అధికారి ఎస్.లక్ష్మానాయక్ తెలిపారు. 2019–20లో కోవిడ్ విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ పేద విద్యార్థులకు మేలు చేయాలన్న సంకల్పంతో ఆ విద్యాసంవత్సరంలో డిగ్రీ, డిప్లమా, ఇతర ఉన్నత కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నిధులు విడుదల చేశారని చెప్పారు. కాలేజీల నిర్వాహకులకు భారం కాకూడదనే సదుద్దేశంతో తల్లుల ఖాతాల్లో జమయిన నగదును కాలేజీ వారికి చెల్లించాలని కోరారు. జిల్లాలో సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు దీనిపై దృష్టి సారించి కళాశాలలకు ఫీజులు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కాలేజీకి ఫీజు చెల్లిస్తే దానికి సంబంధించిన రసీదును నవశకం పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. సచివాలయ స్థాయిలో సమగ్ర పరిశీలన చేసి తగిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు.

సొంత గూడు కట్టుకోవద్దా.. హోంగార్డులపై ఎందుకీ కక్ష?

- ప్రజాప్రతినిధులు, అధికారులను దశాబ్ద కాలంగా కలుస్తూనే ఉన్నాం
- అందులో భాగంగానే 2018లో జీవో జారీ అయింది.. స్థలాలివ్వలేదు
- బాలినేని సానుకూలంగా స్పందించి స్థలాల మంజూరుకు ఓకే చెప్పారు
- హోంగార్డులకు అన్యాయం చేసేలా ఈనాడు, ఆంధ్రజ్యోతిలో తప్పుడు కథనాలు సరికాదు
- రిటైరైతే సంఘానికి సేవలు అందించకూడదనడం ఎంత వరకు న్యాయం
- హోంగార్డుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాబూరావు



విలేకరులతో మాట్లాడుతున్న హోంగార్డుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాబూరావు

ఒంగోలు: 'వచ్చే కనీస వేతనాలు కుటుంబ ఖర్చులకే సరిపోతున్నాయి. ఎన్నాళ్లు ఉన్నా అద్దె ఇళ్లల్లోనే మగ్గాల్సిన దుస్థితి నుంచి గట్టెక్కించమని దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నాం. దీనికి ప్రభుత్వం నుంచి సానుకూల పరిష్కారం లభిస్తుందనుకుంటున్న సమయంలో 'తాయిలాలు' అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురించడం ఎంత వరకు సబబు' అంటూ హోంగార్డుల సంఘం మాజీ అధ్యక్షుడు డి.బాబూరావు(ఇటీవలే రిటైరయ్యారు) ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హోంగార్డులు సాగిస్తున్న పోరాటాన్ని వివరించి, ఈనాడు, ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన తప్పుడు కథనాలను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోంగార్డుల సొంత ఇంటి కల నెరవేర్చాలని ఎస్పీ మొదలు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి వరకు, అదే విధంగా ప్రజాప్రతినిధుల నుంచి జిల్లా అధికారుల వరకు ఏళ్ల తరబడి తిరుగుతూ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 2018 జూన్ 18న అప్పటి హోంశాఖ ముఖ్య కార్యదర్శి జీవో నెంబర్ 77 జారీ చేశారని చెప్పారు. అయితే ఇంటి పట్టాలు మంజూరు కాకపోవడం, ప్రభుత్వం మారడంతో తాము 2019లోనే స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, అదే విధంగా జిల్లా ఎస్పీని కలిసి జీవో గురించి వివరించి ఆదుకోవాలని కోరామన్నారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించిన బాలినేని, ఎస్పీ వేర్వేరుగా అప్పటి కలెక్టర్ పోలా భాస్కర్‌కు లేఖలు రాసి పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారన్నారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. 2020లో కరోనా ఉధృతి తగ్గిన దశలో రెవెన్యూ అధికారులు 176 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇంకా 604 మందికి సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై 2023 సెప్టెంబర్ 6వ తేదీన అప్పటి ఎస్పీ మలికాగర్గ్ 604 మంది జాబితాను కలెక్టర్‌కు పంపి ఇళ్ల పట్టాల విషయాన్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారన్నారు. దీనిపై తాము ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కూడా కలిసి విజ్ఞప్తి చేయగా ఆయన కూడా స్పందించి 2023 నవంబరు 9న కలెక్టర్‌కు లేఖ పంపారని చెప్పారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిలో ఇంకా 4 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని తెలియడంతో తమ ప్రయత్నాన్ని ముమ్మరం చేశామని పేర్కొన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే బాలినేనిని కలిసి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. ఎన్నో ఏళ్లుగా హోంగార్డుల సంఘానికి సేవలు అందించి తాజాగా రిటైరైన తనను ఇళ్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపకూడదనడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. భూమి అందుబాటులో ఉన్నపుడు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని ఆశించడం తప్పెలా అవుతుందని నిలదీశారు. 'తాయిలాలు' అంటూ తప్పుడు కథనాలు రాయడం ద్వారా హోంగార్డుల సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పక్కన పెట్టేలా చేయాలనుకోవడం మీడియా విధానం అవుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉండాల్సిన మీడియా పేదలకు అన్యాయం జరిగేలా కథనాలు రాయడం సరికాదని హితవు పలికారు. హోంగార్డుల గూడు ఘోష గురించి వస్తవాలు తెలుసుకుని, ఇకనైనా మానవత్వంతో వ్యవహరించి కథనాలు రాయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



ప్రొవిజన్స్ షాపును ప్రారంభిస్తున్న పీడీ రవికుమార్

ఒంగోలు టౌన్: మహిళా సమృద్ధి యూనిట్ల ద్వారా స్వయం సహాయక గ్రూపు సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మెప్మా పీడీ టి.రవికుమార్ సూచించారు. శుక్రవారం ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని త్రోవగుంట, కమ్మపాలెం, ఇందుర్తి నగర్, మరాఠిపాలెం, కబాడీపాలెంలో చికెన్ అండ్ ఎగ్ సెంటర్, కూరగాయలు, కూల్ డ్రింక్స్, శారీస్ సెంటర్, టైలరింగ్ షాపు, ప్రొవిజన్స్, టిఫిన్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ ద్వారా జిల్లాలో 133 సమాఖ్యలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సమాఖ్య పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు తక్కువ వడ్డీతో ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రుణం మంజూరైనట్లు వివరించారు. దీని ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న సభ్యులు వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా వ్యాపారాలు చేసినవారు విజయవంతం అవుతారని చెప్పారు. కార్యక్రమంలో జీవనోపాధుల టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఎస్.జయకుమార్, సీఓ రమణమ్మ, రూపాలక్ష్మి, మరియమ్మ, డీఆర్‌పీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్, అధికారులు

- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ భవనాన్ని శుక్రవారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ నూతన భవనాల ఏర్పాటుతో ఉద్యోగులు, వినియోగదారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. నగర మేయర్ గంగాడ సుజాత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కేవీఎన్ రాజు



తనిఖీ చేస్తున్న ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజు

ఒంగోలు సెంట్రల్: పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కేవీఎన్ రాజు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని పొదిలి, దర్శి కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 1165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న పరీక్షలు కావడంతో యూనివర్సిటీ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు పర్యవేక్షణలో పీజీ పరీక్షలు సక్రమంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు ముగిసిన ఆనందంలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు



సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు



పరీక్షలు ముగియడంతో లగేజీతో ఇంటికి వెళ్తున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు

ఒంగోలు: ఇంటర్ పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. శుక్రవారం ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు జనరల్ విభాగంలో 17096 మందికిగాను 16258 మంది, ఒకేషనల్ విభాగంలో 976 మందికి 753 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తంగా 18072 మందికిగాను 1061 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగించామని ఇంకా కేవలం మోడర్న్ లాంగ్వేజి, జాగ్రఫీ పరీక్షలు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంది. వీరి సంఖ్య స్వల్పంగా ఉండనుంది. అందువల్ల దాదాపు ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతోనే పరీక్ష కేంద్రాలు, కాలేజీల వద్ద కోలాహలం నెలకొంది. ఇన్నాళ్లు హాస్టళ్లలో ఉండి విద్యాభ్యాసం చేసిన విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఇంటి ముఖంపట్టారు. బస్టాండులలో సైతం రద్దీ కనిపించింది.

రెండు గృహాల్లో చోరీ

అర్థవీడు(కంభం): పక్కపక్కనే ఉన్న రెండు గృహాల్లో దొంగలు పడి బంగారం, నగదు అపహరించిన సంఘటన అర్థవీడు మండలంలోని మొహిద్దీన్‌పురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద కాశయ్య, ఆయన చిన్న కుమారుడు రంజాన్ ఒకే కాంపౌండ్‌లో పక్క పక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. కుమారుడు రంజాన్ నెల్లూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా ఆయన భార్య నాసర్‌బీ స్వగ్రామంలోనే ఉంటోంది. రెండు కుటుంబాల వారు శుక్రవారం ఇళ్లకు తాళం వేసి కూలి పనికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు రెండు ఇళ్లలోకి చొరబడి బీరువాల తాళాలు పగలగొట్టి సుమారు 10 తులాల బంగారం ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదుతో పోలీసులకు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోయిన 'పచ్చ'మూక

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి
- మహిళ దుస్తులు చింపి దాష్టీకం





టీడీపీ నేతల దాడిలో గాయపడిన సుబ్బారావు, దుస్తులు చినిగిన మహిళ

తర్లుపాడు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆధిపత్యం చలాయించేందుకు టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడిన ఘటన తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తమ్మిశెట్టి సుబ్బారావుపై స్థానిక టీడీపీ నేతలు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పార్టీ జెండాతో ఓ కార్యక్రమానికి హాజరై ఇంటికి వచ్చిన సుబ్బారావుపై దౌర్జన్యానికి దిగారు. ఇంట్లోకి చొచ్చుకెళ్లి మరీ దాడి చేశారు. అంతటితో ఆగక ఇంట్లో ఉన్న మహిళలనూ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. వైఎస్సార్ సీపీ జెండాతో తిరిగితే చంపేస్తామని టీడీపీ నాయకులు బెదిరించారని సుబ్బారావు వాపోయాడు. గాయాలతో ఉన్న సుబ్బారావును బంధువులు మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ తెలిపారు. క్షతగాత్రుడిని స్థానిక సర్పంచ్ పెద్ద మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు.